సాక్షి
సిద్దిపేట
శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



చిన్నారుల మోములో చిరునవ్వు
చిన్నతనంలోనే అందరికీ దూరమై పనుల్లో చేరిన బాలలకు పోలీసులు విముక్తి కల్పిస్తున్నారు. ఆపరేషన్ స్మైల్ సత్ఫలితాలిస్తోంది. 8లో..



ఆగని ఇసుకలొల్లి
మెదక్ మండల పరిధిలోని హల్దీవాగు నుంచి ఇసుకను తరలించొద్దంటూ చిట్యాల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 8లో..



బడిలో పిల్లలు.. బయట టీచర్లు
పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, ఉపాధ్యాయులు పాఠాలు బోధించకుండా బయట తిరుగుతున్నారు. 9లో..

న్యూస్‌రీల్

పేదల జీవితాల్లో వెలుగులు



శిబిరాన్ని పరీక్షిస్తున్న రాధాకృష్ణశర్మ

చిన్నకోదూరు(సిద్దిపేట): సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కంటివెలుగు కార్యక్రమం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కస్తూరిపల్లిలో ఎంపీపీ మాణిక్యరెడ్డితో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శవంతంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ స్వామి, ఎంపీటీసీ పద్మ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, రైతు బంధు జిల్లా సభ్యులు వెంకటేశం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, వైద్యులు, నాయకులు పాల్గొన్నారు.

11న నవోదయ ఎంట్రన్స్ పరీక్ష



వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లా వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 11 శనివారం ప్రవేశ పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపాల్ రమేశ్‌రావు తెలిపారు. ప్రవేశ పరీక్ష కోసం వర్గల్ నవోదయ, గజ్వేల్ సెయింట్ జోసెఫ్ హైస్కూల్, ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ హైస్కూల్ ఈ మూడు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు అడ్మిట్‌కార్డు (హాల్ టికెట్)ను హెచ్‌టీటీపీఎస్://నవోదయ.గవ్.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థి హాల్‌టికెట్‌లో సూచించిన కేంద్రంలో పరీక్ష రాయాలన్నారు.

బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



మాట్లాడుతున్న చంద్రమౌళి

దుబ్బాకటౌన్: బీడీ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తింపజేసి ఆదుకోవాలని బీఎంఎస్ జిల్లా కన్వీనర్ వల్లాల చంద్రమౌళి కోరారు. శుక్రవారం దుబ్బాకలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు పెన్షన్ రాకుండా కొత్తగా జీవో తేవడం మానుకోవాలన్నారు. అలాగే ప్రసూతి సాయం రూ.30 వేలు ఇవ్వాలన్నారు. ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం బీడీ కార్మికుల పట్ల అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ ఈ నెల 14 చలో హైదరాబాద్ కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజు, సంతోష్, తదితరులు ఉన్నారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జనగామ వెస్ట్ సబ్ డివిజన్ ఏఎస్పీ రమాదేవి



చేర్యాల(సిద్దిపేట): తపాలా కార్యాలయంలో అందిస్తున్న సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జనగామ వెస్ట్ సబ్ డివిజన్ ఏఎస్పీ రమాదేవి కోరారు. శుక్రవారం స్థానిక సబ్ పోస్ట్‌ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్‌లో ఇప్పటివరకున్న అత్యధిక పరిమితిని రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెంచి వడ్డీ రేటు 8 శాతం చేసిందన్నారు. మహిళా బచత్ సమ్మాన్ యోజన ద్వారా ఆడపిల్లల భవిష్యత్ కోసం కేంద్ర ప్రభుత్వం కొత్త స్కీమ్ ప్రవేశ పెట్టిందన్నారు. ఇందులో అత్యధికంగా రూ.2 లక్షలు జమ చేసుకోవచ్చన్నారు. మరిన్ని కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేసి పీఎం స్వనిధి, ఆయుష్మాన్‌భారత్, పీఎంఎస్‌వైఎం, పీఎంఎల్‌వైఎం వంటి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందుబాటులోకి తేవడానికి కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపులు చేసిందన్నారు. ఆమె వెంట చేర్యాల సబ్ పోస్ట్ మాస్టర్ దిలీప్‌కుమార్, మెయిల్ ఓవర్ అధికారి భిక్షపతి ఉన్నారు.

ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు

- మైనార్టీ రుణాలకు భారీగా అప్లికేషన్లు
- 63 యూనిట్లకు 3,441 మంది..
- రూ.లక్ష లోపు 44, రూ.2లక్షలలోపు 19 యూనిట్లు
- అర్హుల ఎంపికలో అధికారుల మల్లగుల్లాలు

సాక్షి, సిద్దిపేట: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కల్పించేందుకు మంజూరు చేసే రుణాలకు యువత నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. జనవరి 9వ తేదీ వరకు ఈ దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 63 యూనిట్లు అందుబాటులో ఉండగా 3,441 మంది అప్లికేషన్స్ అందజేశారు. యూనిట్లు పరిమితంగా ఉండటంతో అర్హులను ఎంపిక చేసేందుకు అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. కాగా ఏడు సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమం నిలిచిపోయింది.

- జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, 499 గ్రామాలకు కేవలం 63 యూనిట్లు మాత్రమే కేటాయించారు.
- ఇందులో అక్కన్నపేట, కొమురవెల్లి, మర్కూక్ మండలాలకు ఒక్క యూనిట్ సైతం కేటాయించలేదు. అలాగే మిగతా కొన్ని మండలాలకు ఒకటి, మరికొన్నింటికి రెండు నుంచి ఐదు యూనిట్ల వరకు దక్కే అవకాశం ఉంది.
- జిల్లాకు కేటాయించిన యూనిట్లలో రూ.లక్ష లోపు రుణాలు అందజేసేవి 44 యూనిట్లు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వం 80 శాతం సబ్సిడీని ఇస్తుంది. లబ్ధిదారులు కేవలం రూ.20 వేలు చెల్లించాల్సి ఉంటుంది.
- అలాగే మిగిలిన 19 యూనిట్లలో రూ.2 లక్షల రుణం అందజేస్తారు. దీనిలో ప్రభుత్వం 70 శాతం సబ్సిడీ ఇవ్వగా లబ్ధిదారులు రూ.60 వేలు చెల్లించాలి. ఈ మొత్తం యూనిట్లకు జిల్లాకు మొత్తం రూ.61.8 లక్షలను కేటాయించారు.
- మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాల అందజేతకు గతేడాది డిసెంబర్ 19 నుంచి జనవరి 9వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించారు.
- ఈ దరఖాస్తును మున్సిపాలిటీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో పరిశీలించి జిల్లా మైనార్టీ కార్యాలయానికి ఆమోదానికి పంపనున్నారు. ఇందుకోసం ఇప్పటికే మైనార్టీ శాఖ నుంచి ఆదేశాలు పంపించారు. లబ్ధిదారుల ఎంపికపై ఎంపీడీఓలు, కమిషనర్లు కసరత్తు పడుతున్నారు. కాగా ఇప్పటికే అక్కడక్కడ స్థానిక ప్రజాప్రతినిధులు నుంచి పైరవీలు వస్తున్నట్లు సమాచారం. దీంతో అధికారులపై వత్తిడి పెరుగుతున్నట్లు తెలుస్తోంది.
- దరఖాస్తుదారులందరికీ రుణాలు అందజేయాలంటే జిల్లాకు సుమారుగా రూ.34 కోట్లు అవసరం.
- ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేలకు మైనార్టీ రుణాలకు నిధులు పెంచాలని మైనార్టీ నాయకులు వినతి పత్రాలు అందజేశారు. దీంతో మంత్రుల దృష్టికి ఎమ్మెల్యేలు తీసుకెళ్లడంతో నిధులు పెంచేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. దరఖాస్తు చేసుకున్న వారందరికీ రుణాలు మంజూరు చేయాలని మైనార్టీలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయం



మండల కమిటీల ద్వారా ఎంపిక



జిల్లాకు మంజూరైన యూనిట్లను జనాభా ప్రతిపాదికన మండలం, మున్సిపాలిటీలకు ఎంపిక చేయాల్సిన లక్ష్యాలను అందించాం. ఆయా ప్రత్యేక కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరగనుంది. అక్కడి నుంచి ప్రపోజల్స్ వచ్చిన వారికి రుణాలను అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం.
– గోపాల్‌రావు, ఇన్‌చార్జి మైనార్టీ సంక్షేమ అధికారి, డీఆర్డీఏ



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్

అవసరమైతే రీడింగ్ గ్లాస్‌లు ఇవ్వండి

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: అవసరమైన ప్రతీ ఒక్కరికి రీడింగ్ గ్లాస్‌లను అందజేయాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులకు సూచించారు. శుక్రవారం శుక్రవారం జిల్లా కేంద్రంలోని 43 వార్డులోని బాలికల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు ఈ కార్యక్రమం ద్వారాఎంత మందికి పరీక్షలు నిర్వహించి, ఎంత మందికి అద్దాలు ఇచ్చారని విషయాలపై ఆరా తీశారు. వైద్యుల పరీక్షల ప్రిస్కిప్షన్, కంటి అద్దాలు అవసరమైన వారి వివరాలను యాప్‌లో నమోదు చేస్తే 15 రోజుల్లో వారికి కావాల్సినవి అందుతాయన్నారు. కంటి పరీక్షల కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని మంత్రి సూచించారు. ఆయన వెంట మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ కాశీనాథ్, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ పూర్ణిమ ఎల్లం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మోహిజ్ తదితరులు పాల్గొన్నారు.

‘పామాయిల్’ లక్ష్యాన్ని చేరుకోవాలి



ఉపాధ్యాయ బృందంతో కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: జిల్లాలో పామాయిల్ తోటల లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌తో కలిసి ఆయిల్‌పామ్ సాగుపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ రైతులకు లాభదాయకమైన పంట అని దీని సాగుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతీ డివిజన్, మండలం, క్లస్టర్ వారీగా ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకునేలా క్షేత్ర స్థాయిలో రైతులకు వివరించాలన్నారు. ప్రతీ డివిజన్, మండలం, క్లస్టర్ వారీగా తక్కువ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టి రైతులను ప్రోత్సహించాలన్నారు. ఇప్పటి నుంచి ప్రతి 15 రోజులకొకసారి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. మలివిడత సమావేశంలోపు లక్ష్యాన్ని చేరుకునేలా పని చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రామక్మి, ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో చేపట్టిన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆదేశించారు. శుక్రవారం ఆయన సిద్దిపేట పట్టణం మంగమ్మతోటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్, ప్రహరీ ఎత్తు పెంపు, మరుగుదొడ్ల రిపేర్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీదేవి, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాలలో అవసరమైన బోర్‌వెల్ కోసం గ్రౌండ్ వాటర్ అధికారిని ఆదేశిస్తానని తెలిపారు. అనంతరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి అధిక సంఖ్యలో నిలువ ఉన్న పాఠ్యపుస్తకాలను అవసరమైన పాఠశాలకు చేరవేయాలని స్టోర్ ఇన్చార్జిని ఆదేశించారు. కలెక్టర్ వెంట సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

బీఆర్‌ఎస్ అంటే బీజేపీకి వణుకు



గోదావరి జలాలను విడుదల చేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, పక్కన ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు



- మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి
- మల్లన్నసాగర్ నుంచి నీటి విడుదల

గజ్వేల్: అవినీతిని ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ అంటేనే బీజేపీకి వణుకు పట్టుకుందని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మతో కలిసిగ గజ్వేల్ మండలం కొడకండ్ల వద్ద మల్లన్నసాగర్ కాల్వ నుంచి కూడవెల్లి వాగులోకి గోదావరి జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్ని కుట్రలు పన్నినా, అవరోధాలు సృష్టించినా పార్లమెంట్‌లో బీజేపీని దీటుగా ఎదుర్కొంటున్న పార్టీ బీఆర్‌ఎస్ మాత్రమేనన్నారు. దేశంలోని తొమ్మిది పార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి అదానీ సంస్థల అక్రమాలు, ప్రభుత్వ రంగ బీమా సంస్థలు, బ్యాంకుల నిధుల దుర్వినియోగం వంటి అంశాల్లో కేంద్రం అవినీతిని బట్టబయలు చేయగలిగామన్నారు. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమాన్ని కొత్త పుంతలు తొక్కించి దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్ దక్కిందన్నారు. ప్రతి పక్షాలు ఎన్నిరకాల కుట్రలు చేసిన మల్లన్నసాగర్ ప్రాజెక్ట్‌ను మూడేళ్లల్లో పూర్తిచేసిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. నేటికీ మల్లన్నసాగర్‌పై సుప్రీం కోర్టులో కేసులు నడుస్తున్నాయన్నారు. గతంలో ప్రాజెక్ట్‌లను అడ్డుకున్న ప్రతిపక్ష నేతలే నేడు సాగు నీటి కోసం దరఖాస్తులు పట్టుకొని వస్తున్నారని తెలిపారు. నేడు కూడవెల్లి వాగులోకి నీటి విడుదలతో వాగుఆయకట్టు వేలాది ఎకరాలకు సాగునీటి సమస్య తీరిందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఊడెం క్రిష్టారెడ్డి, దేవీ రవీందర్, బెండె మధు, నవాజ్‌మీరా, పండరి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొండ పోచమ్మ నుంచి హల్దీలోకి

వర్గల్(గజ్వేల్): గోదావరి జలాల ద్వారా రైతుల సాగునీటి కష్టాలు తీర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డితో కలిసి అవుసులోనిపల్లి వద్ద సంగారెడ్డి కెనాల్ ఆఫ్‌టేక్ తూము గేట్లు ఎత్తి కొండ పోచమ్మ ప్రాజెక్టు నుంచి కాళేశ్వరం గోదావరి జలాలను హల్దీలోకి విడుదల చేశారు. గోదారమ్మకు చీర, సారె సమర్పించారు. పూలు, పసుపు కుంకుమ చల్లారు. యాసంగిలో రైతులు సాగుచేసిన పంటలు నీటిఎద్దడికి గురికావొద్దని సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు గోదావరి జలాలు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ బాలూయాదవ్, ఎంపీపీ లతారమేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వాలని వంటావార్పుతో నిరసన



అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రాజెక్టు గుడాటిపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన దీక్ష శిబిరంలో పెళ్లయిన యువతులు శుక్రవారం వంటావార్పుతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాతముత్తాల నాటి విలువైన భూములను ప్రాజెక్టు నిర్మాణానికి అప్పగిస్తే అర్హులైన వారికి పరిహారం ఇవ్వాలన్న సోయి ప్రభుత్వానికి లేకుండా పోయిందని వాపోయారు. ఆడబిడ్డలు గత రెండు నెలలుగా ప్రాజెక్టు వద్ద ఆందోళన చేపడుతున్నా అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో పెళ్లయిన యువతులతో పాటు కాంగ్రెస్ నియోజకవర్గ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ మంద పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ప్రవేశ పరీక్ష హాల్ టిక్కెట్లు విడుదల

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టైలరింగ్, డ్రాయింగ్ పరీక్ష రాసేందుకు నవంబర్, డిసెంబర్–21లో రుసుం చెల్లించిన అభ్యర్థులకు నిర్వహించనున్న పరీక్ష రాసేందుకు హాల్ టికెట్లను http//bse.telangana.gov.in వెబ్సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పరీక్షలు ఈనెల 11, 14, తేదీల్లో 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యం



వృత్తి నైపుణ్యం శిక్షణ ప్రారంభిస్తున్న దృశ్యం

చిన్నకోదూరు(సిద్దిపేట): మత్స్యకారుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మత్స్యశాఖ జిల్లా అధికారి మల్లేశం తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మాచాపూర్‌లో పెద్దచెరువులో మత్స్యకారులకు వృత్తి నైపుణ్యతపై శిక్షణ నిర్వహించారు. తెప్ప తోలడం, వల విసరడంపై శిక్షణ నిర్వహించి అర్హత సాధించిన వారికి సొసైటీలో సభ్యత్వం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చేపపిల్లలను ఉచితంగా వదిలి, వాటిని పట్టడానికి వలలు, విక్రయించడానికి వాహనాలు సబ్సిడీపై అందిస్తుందన్నారు. రంగనాయకసాగర్‌తో ఈ ప్రాంతంలో మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. అర్హులైన వారందరికీ సొసైటీలో సభ్యత్వం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షులు పాపయ్య, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, రైతుబంధు జిల్లా సభ్యులు వెంకటేశం, సర్పంచ్‌లు బాబు, ఉమేష్ చంద్ర, లింగారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జమున, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలు.. భవిష్యత్ ప్రగతికి ‘దిక్సూచి’లు

బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం



క్రీడాకారులతో వకుళాభరణం

సిద్దిపేటరూరల్: మహాత్మా జ్యోతీబాపులే గురుకులాలు.. భవిష్యత్ ప్రగతికి ‘దిక్సూచి’లు అని మేథోవంతమైన యువతను అందించే కర్మాగారాలుగా గురుకులాలు బాసిల్లుతున్నాయని బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నగుండవెల్లి శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల గౌరవ వందనంతో ఘనంగా స్వాగతించారు. బీసీ సంక్షేమశాఖ అధికారి సరోజ పుష్పగుచ్ఛ అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దార్శనికత, దృక్పథంతో నెలకొల్పిన ఈ పాఠశాలలు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత ప్రమాణాలు కలిగిన యువతను అందిస్తున్నాయన్నారు. సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు ఆదర్శవంతమైన ప్రజాప్రతినిధిగా అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ పాఠశాలలు ‘ఆధునిక సమాజంలో దేవాలయాల్లు’ అని అన్నారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రసంశ పత్రాలను, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణదయాసాగర్, సహాయ సంక్షేమ అధికారి మురళీయోగేశ్, ఆర్సీఓ ప్రభాకర్, డీసీఓ శోభారాణి, ప్రిన్సిపాల్స్ శారద, రాణి తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ లబ్ధిదారుల ఎంపిక పూర్తి

- 3,518 దరఖాస్తుల్లో 1,118 మంది అర్హులుగా గుర్తింపు
- మున్సిపల్, ఆర్డీఓ కార్యాలయాల వద్ద జాబితా ప్రదర్శన



అర్హుల జాబితాను ప్రదర్శిస్తున్న కమిషనర్ విద్యాధర్

గజ్వేల్: గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఎట్టకేలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. 3,518 దరఖాస్తులు రాగా ఇందులో 1,118 మందని ఎంపిక చేసినట్లు అధికారుల ప్రకటించారు. ఈ మేరకు మున్సిపల్, ఆర్డీఓ కార్యాలయాల వద్ద జాబితాలను గోడలకు అతికించారు. మరోవైపు జాబితాలో చోటుదక్కని పేదలు ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీకి మొత్తం 1,250 ఇళ్లను మంజూరు చేశారు. ఈ మోడల్ కాలనీకి సంబంధించి సీఎం 2015 మే 9న పట్టణంలోని పాలిటెక్నిక్ వెనుక భాగంలోని ప్రభుత్వ స్థలంలో శంకుస్థాపన చేసి పనులు పూర్తి చేసిన సంగతి తెలిసిందే. కాలనీవాసులకు రోడ్లు, మంచినీరు, షాపింగ్ కాంప్లెక్స్, ప్రార్థనా మందిరాలు, ఫంక్షన్‌హాళ్లు వంటి సదుపాయాలు కల్పించారు.

రెండు ఫ్లోర్లుగా నిర్మాణం

ఈ కాలనీలో ఒక్కో ఇళ్లు 570 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మాణం జరిగింది. 156 బ్లాకులుగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఒక్కో బ్లాకులో కింద నాలుగు, పైన నాలుగు(మొత్తం 8 ఇళ్లు) రెండు ఫ్లోర్లుగా నిర్మాణం చేశారు. ఈ జాబితాలో ఇందులో ఏమైనా అభ్యంతరాలుంటే వారంలోగా ఫిర్యాదులను అందజేయాలని, ఇందుకోసం మున్సిపల్, ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఫిర్యాదు బాక్స్‌లను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ విద్యాధర్ తెలిపారు. కాగా జాబితాలో చోటు దక్కని పేదలు ఆవేదన చెందుతున్నారు. అర్హత ఉన్న వివరాలను మరోసారి పరిశీలించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

విశ్వనాథ్‌కు చిత్రపత్ర నీరాజనం


రావి ఆకుపై విశ్వనాథ్ చిత్రం

నారాయణఖేడ్: దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, చిత్ర దర్శకుడు కె.విశ్వనాథ్ శివైక్యం చెందారు. ఆయనకు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం అనంతసాగర్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు గుండు శివకుమార్ రావి ఆకుపై విశ్వనాథ్ చిత్రాన్ని మలచి చిత్రపత్ర నివాళి అర్పించారు. రసగీతి సాహిత్యవేదిక అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి నివాళులర్పించారు.

ఆలయ కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి శ్రీనల్లపోచమ్మదేవి ఆలయ కమిటీ ఏర్పాటుకు దేవదాయశాఖ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. 2016లో తునికి శ్రీనల్లపోచమ్మదేవి ఆలయాన్ని ప్రభుత్వం దేవదాయశాఖలో విలీనం చేసింది. 2017-18లో ఆలయ కమిటీ ఏర్పాటు జరిగింది. నాలుగేళ్ల అనంతరం ప్రభుత్వం ఆలయ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆలయ కమిటీలో చైర్మన్‌తోసహా ఎనిమిది మంది ధర్మకర్త ఉంటారని తెలిపారు. ఉత్సాహం ఉన్నవ్యక్తులు సంగారెడ్డి దేవదాయ శాఖ కార్యాలయంలో 10 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గంజాయి విక్రేత అరెస్ట్


నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

రామాయంపేట(మెదక్): విశ్వసనీయ సమాచారం మేరకు ఓ వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని, అతడి నుంచి 155 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం పాపన్నపేట మండలం నాగ్సానిపల్లి గ్రామానికి చెందిన మంతూరి సాయిచరణ్ గంజాయి విక్రయిస్తున్నాడు. నిందితుడు హైదరాబాద్‌లో గంజాయి కొనుగోలుచేసి కొంత కాలంగా రామాయంపేట పరిసరా ప్రాంతాల్లో అమ్ముతున్నట్లు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అతడిని అక్కన్నపేట రైల్వేస్టేషన్ వద్ద పట్టుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మంది పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 13 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

FREE TRAINING
■ పేద అమ్మాయిలకు హైదరాబాద్ కూకట్‌పల్లి లో ఫ్రీ వసతితో 120డేస్ ఫ్రీ-ట్రైనింగ్, HR+ కమ్యూనికేషన్ + కంప్యూటర్ లర్నింగ్, ప్రాక్టీస్ తర్వాత వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆదాయం+మంచి భవిష్యత్తు. స్టార్ట్ ఫోన్ మస్ట్: 9032944447. [HA-5585]

SERVICES
■ బాలాజీ గోల్డ్ : మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019. [T-1746]

WANTED
■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779876]
■ హైదరాబాద్‌లో ఇంటిపని, వంటపని మరియు పిల్లలను చూసుకొనుటకు 45 సం॥లోపు ఆడ పనివాళ్ళు కావలెను. జీతం: 15,000/-, భోజన వసతి కల్పించబడును. ఫోన్ 9063005675. [HA-13889]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చిన్నారుల మోములో చిరునవ్వు

- 112 మంది బాల కార్మికులకు విముక్తి
- పట్టుబడిన పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్, చిన్నారుల అప్పగింత
- బాల కార్మికుల రక్షణకు 1098 చైల్డ్‌లైన్ టోల్ ఫ్రీ

చిన్నతనంలో తల్లిదండ్రులు చనిపోయి, వారి ఆలనాపాలన చూసేవారు లేక కొంతమంది అనాథలుగా మారుతున్నారు. వారే బాల కార్మికులుగా అవతారమెత్తి దుర్భర జీవనం సాగిస్తున్నారు. అటువంటి బాలలను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ పేరుతో కార్యక్రమాలు చేపడుతోంది. ఆపరేషన్ ముస్కాన్ సత్ఫలితాలు ఇస్తోంది.


ఇటుక బట్టీల వద్ద చిన్నారుల తల్లిదండ్రులతో అధికారులు


పటాన్‌చెరులో వాల్‌పోస్టర్లతో అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: తల్లిదండ్రులు లేక, ఆర్థిక సమస్యలతో ఎంతోమంది పిల్లలు బాల కార్మికులుగా మారుతుంటే, మరి కొంతమంది భిక్షాటన చేస్తున్నారు. తప్పిపోయిన పిల్లలు అనాథలుగా దిక్కుతోచని స్థితిలో వెట్టి చాకిరికి గురవుతున్నారు. అలాంటి వారిని గుర్తించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయి. డేటా ఆపరేషన్ స్మైల్ , ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్నారు. జిల్లా సంక్షేమ అధికారి సమక్షంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం చైల్డ్ లైన్(1098) , బాలల సంక్షేమ సమితి ప్రత్యేక బాలల పరిరక్షణ విభాగం జాతీయ బాల కార్మికుల విభాగాలు సమన్వయంతో బాల కార్మికులను గుర్తించి వారికి విముక్తి కల్పిస్తున్నారు. జిల్లాలో జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు ఆపరేషన్ స్మైల్‌లో 112 మంది బాల కార్మికులకు విముక్తి కలిగించినట్లు జిల్లా పోలీసులు, జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారిణి పద్మావతి వెల్లడించారు.

ఆపరేషన్ స్మైల్, ముస్కాన్‌తో...

కార్మికులుగా మారుతున్న 18 ఏళ్లలోపు బాలలను రక్షించేందుకు ఆపరేషన్ స్మైల్ పేరుతో జిల్లా బాలల సంరక్షణ విభాగం (డీసీపీయూ), పోలీస్ విభాగం, చైల్డ్‌లైన్ లేబర్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా జనవరిలో తొమ్మిదో విడత ఆపరేషన్ స్మైల్ నిర్వహిస్తున్నారు. బాలలతో పనులు చేయిస్తున్న యజమానులపై కేసులు నమోదు చేయడంతో పాటు వీధి బాలలు, తప్పిపోయి పనిచేస్తున్న బాలకార్మికులను గుర్తించి వారికి విముక్తి కల్పిస్తున్నారు. ఈ ఏడాది ఆపరేషన్ స్మైల్‌లో 112 మందికి విముక్తి కల్పించారు. ఆపరేషన్ ముస్కాన్ పేరుతో జులై 1 తేదీ నుంచి 31 తేదీ వరకు అదే అధికారుల బృందం తనిఖీలు నిర్వహిస్తారు. అనంతరం ఆరు నెలల్లో వీధుల్లో పట్టుబడిన బాల కార్మికులను సమగ్ర బాల పరిరక్షణ పథకం కింద బాల సహాయక కిడ్స్ ఇవ్వడంతో పాటు వారి సంరక్షణ బాధ్యతలను ప్రభుత్వమే చూసుకుంటుంది.

బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తున్నాం



బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలనకు పోలీసు శాఖ, వివిధ శాఖల సహకారంతో ప్రతీ ఏడాది రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్‌లో 112 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించాం. ప్రతీ ఏడాది గుర్తించిన బాలకార్మికుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి పిల్లలకు అప్పగిస్తున్నాం. – రమణ కుమార్, ఎస్పీ

గుర్తించిన పిల్లల స్థితిగతులు తెలుసుకుంటున్నాం



గుర్తించిన బాలకార్మికుల స్కూల్‌కు వెళ్తున్నారా? లేదా? అనే దానిపై ప్రతీనెల స్థితిగతులు తెలుసుకుంటున్నాం. బాల కార్మికులుగా మారుతున్నవారికి బంగారు భవిష్యత్ ఇవ్వడం కోసం చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ ఏడాది ప్రత్యేక డ్రైవ్ లు పోలీసు శాఖతో కలసి బాలకార్మికులను గుర్తించి, బాలలను సీడబ్ల్యూసీ ఆదేశానుసారం విద్య, వైద్యం, వసతుల సౌకర్యం కల్పిస్తున్నాం. ఎక్కడైనా బాల కార్మికులకు కనిపిస్తే 1098 చైల్డ్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. – పద్మావతి, జిల్లా సంక్షేమ అధికారి

మాయమాటలతో మహిళకు టోకరా

మద్దూరు(హుస్నాబాద్): కుటుంబ సమస్యలను పరిష్కరిస్తామంటూ మహిళకు మాయమాటాలు చెప్పి ఓ వ్యక్తి నగదు తీసుకుని ఉడాయించాడు. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్ఐ నారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గాగ్గిళ్లాపూర్ గ్రామానిక చెందిన కావ్య లోకల్ చానల్ బతుకమ్మ టీవీలో కుటుంబ సమస్యలు పరిష్కరికరించబడును యాడ్‌ను చూసింది. వారికి ఫోన్ చేసి తన సమస్యలు చెప్పుకుంది. వారు చెప్పిన మాయమాటలు నమ్మి రూ.34 వేలు పంపి మోసపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెంకట్రావ్‌పేటలో గడ్డివాము దగ్ధం


కాలిపోతున్న గడ్డివాము

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకట్రావ్‌పేటలో గురువారం రాత్రి గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన రత్ని మల్లేశంకు గ్రామ బురుజు సమీప స్థలంలో సుమారు వందగడ్డిమోపుల గడ్డివాము ఉంది. రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పూర్తిగా కాలిపోయింది. దీంతో సుమారు రూ.10 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. పశువులకు మేత కరువైందన్నాడు.

పట్టాభూమి మార్పిడిపై ఆందోళన


కోహెడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబం

కోహెడ(హుస్నాబాద్): 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పట్టాభూమిని రెవెన్యూ అధికారులు ఇతరులకు పట్టా చేశారంటూ బాధితుడు ఆందోళనకు దిగాడు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన గూల్ల బాలయ్య కుటుంబంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించాడు. కోహెడ శివారు సర్వే నంబర్ 89లో రెండెకరాల పట్టాభూమిని తీగలకుంటపల్లికి చెందిన రజనీకర్‌రెడ్డి, తిరుపతికి చెరో ఎకరం చొప్పున అధికారులు పట్టా చేశారని ఆరోపించాడు. ప్రభుత్వం సాదా బైనామాతో పట్టాకు అవకాశం కల్పించినప్పుడు పట్టాపాసు పుస్తకం కోసం అధికారులకు అర్జీ పెట్టుకున్నా అధికారులు స్పందించలేదన్నారు. తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ జావిద్ అహ్మద్‌కు మొరపెట్టుకున్నాడు. దీంతో తహసీల్దార్ స్పందించి క్షేత్రస్థాయి విచారణకు ఆర్ఐ హరీశ్‌ను ఆదేశించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని, వారి సూచనల మేరకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వాడంతో ఆందోళన విరమించాడు. కాగా ఇట్టిరెడ్డి సరోజన, మహేశ్వర్‌రెడ్డి నుంచి ధరణిలో సేల్ డీడీ చేసుకున్నమని కొనుగోలుదారులు రజనీకర్‌రెడ్డి, తిరుపతి తెలిపారు.

హత్యకేసులో ఇద్దరికి జీవిత ఖైదు

సిద్దిపేటఅర్బన్: యువకుడి హత్య కేసులో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు విధించినట్టు త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ శుక్రవారం తెలిపారు. అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన శీల నాగరాజు (25) వివాహం నిశ్చయమైంది. బంధువులకు శుభలేఖలు ఇవ్వడానికి 2017 జనవరి 25వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులందరినీ విచారించినా అతడి ఆచూకీ దొరకలేదు. అనుమానంతో తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా బావి సమీపంలో నాగరాజు చెప్పులు, సెల్‌ఫోన్ లభించాయి. కొంత దూరంలో సైకిల్ పడి ఉంది. బావిలో పడి ఉంటాడనే అనుమానంతో గజఈతగాళ్లతో వెతకగా నాగరాజు శవం లభ్యమైంది. మృతుడి తండ్రి శీల భూమయ్య గుర్తు తెలియని వ్యక్తులు తన కుమారుడిని హత్య చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి రూరల్ ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా అప్పటి సీఐ సైదులు, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి నిందితులు శీల పరశురాములు, శీల ఎల్లయ్యను విచారించారు. శీల ఎల్లయ్య కూతురుకు వివాహమైనా భర్తను వదిలి ఆమె మరో వ్యక్తితో వెళ్లిపోయింది. దీనికి మృతుడు నాగరాజు సహకరించాడని అతడిపై కక్ష పెంచుకొని హత్య చేశారు. వారిని పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో కేసు విచారణ జరగగా జడ్జి రఘురాం ఇరువురి వాదనలు విన్న తర్వాత నేరస్తులపై నేరం రుజువు కావడంతో ఇద్దరికీ జీవిత ఖైదు, రూ.2 వేల జరిమానా విధించారు. ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సైదులు, పీపీ వెంకట్‌లింగం, కోర్టు కానిస్టేబుళ్లు, రవి, శ్రీనివాస్, కోర్టు లైజనింగ్ ఏఎస్ఐ స్వామిదాస్, హెడ్‌కానిస్టేబుల్ రాజమల్లును సీపీ శ్వేత అభినందించారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

గజ్వేల్‌రూరల్: భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోని, బాధితులకు న్యాయం చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 1992లో కుకునూర్‌పల్లి గ్రామానికి చెందిన కొండయ్య కొంతకాలం క్రితం మృతి చెందాడు. దీంతో అతడి భార్య కమలమ్మ 0.20 గుంటల భూమిని పోతి చేసుకుంది. కాగా ఇదే భూమిలో నుంచి కుకునూర్‌పల్లి హైవే రోడ్డుకు 0.13గుంటల భూమి పోవడంతో కేవలం 0.07 గుంటలు మాత్రమే మిగిలింది. ప్రస్తుత సర్పంచ్ పాల్కంపల్లి జయంతి భర్త నరేందర్‌తో పాటు మరో వ్యక్తి ఈగ శంకరయ్య కలిసి కమలమ్మ భూమిలో ఉన్న కడ్డీలను తొలగించి, ఆమె కుటుంబ సభ్యులపై దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. కాగా అధికారులు సర్వేచేసి ఆ భూమి కమలమ్మదేనని నిర్ధారించారని సర్పంచ్ భర్త బాధితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇదే విషయమై కుకునూర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. బాధితులకు న్యాయం జరిగని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు వేణు, భూబాధిత సంఘం నాయకులు మహేందర్, రవి, బాబు తదితరులున్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌మావో

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్రంలోని భూ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించి తహసీల్దార్ ఆరీఫా, మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్‌కు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలోని గ్రామాలతో పాటు పట్టణ కేంద్రంలో ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు లేని నిరుపేదలు ఉన్నారని, వారిని ఆదుకోవాలన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడినవారికి సిద్దిపేట కోర్టు శుక్రవారం జరిమానా విధించింది. నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 13 మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన జడ్జి రమేశ్‌బాబు రూ.29 వేల జరిమానా విధించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


బాలునాయక్ (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కొల్చారం మండలం సీతారాం గిరిజన తండాలో శుక్రవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. కొల్చారం ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, తండా వాసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గిరిజన తండాకు చెందిన మృతుడు మాలోత్ బాలు నాయక్ (36) వ్యవసాయం చేస్తున్నాడు. తనకున్న పొలంలో మూడు బోర్లు వేసినా నీరు పడకపోవడం , బోర్లు వేసేందుకు తెచ్చిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఆవేదన చెందేవాడు. ఈ విషయంపై భార్య సునీతతో తరచూ గొడవపడేవాడు. గురువారం రాత్రి కూడా భార్యతో గొడవపడి బయటకు వెళ్లాడు. అర్ధరాత్రి అవుతున్న భర్త ఇంటికి రాకపోవడంతో భార్య ఇంటి పరిసర ప్రాంతాల్లోని రోడ్డుకు ఇరువైపులా వెతికింది. రోడ్డుకు అవతల ఉన్న కల్లు దుకాణంలో ఉరివేసుకుని కనిపించాడు. దీంతో చుట్టుపక్కల వారికి తెలిపడంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు ప్రారంభించారు. మృతుడికి 14 ఏళ్ల లోపు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఆత్మహత్యపై అనుమానాలు

మృతుడు బాలు నాయక్‌కు పట్టాభూమితో పాటు, తనను పెంచుకున్న తల్లిదండ్రుల ద్వారా ప్రభుత్వ భూమి సంక్రమించినట్లు తండావాసుల ద్వారా తెలిసింది. ఈ భూమిపై కొందరి కన్ను పడటం, సంబంధిత వ్యక్తులు బాలుతో గొడవపడేవారని, ఇదే విషయమై పలుమార్లు తండాలో పంచాయితీలు కూడా జరిగినట్లు చెప్పారు. ఇదే బాలు నాయక్ ఆత్మహత్యకు కారణమై ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అప్పుల బాధ భరించలేక యువకుడి ఆత్మహత్య


నవీన్‌కుమార్ మృతదేహం

చేగుంట(తూప్రాన్): అప్పులు తీర్చే మార్గం కనిపించక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నవీన్ కుమార్(22) అదే గ్రామానికి చెందిన అరుణను 2019లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. అరుణ ప్రైవేట్ బ్యాంకులో డేటా ఆపరేటర్‌గా పనిచేస్తోంది. నవీన్‌కుమార్‌కు ఉపాధి లేకపోవడంతో కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం కనిపించకపోవడంతో అరుణను గురువారం పుట్టింట్లో వదిలి వచ్చి అదేరోజు రాత్రి ఇంట్లో ఉరివేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి


చిరుత దాడిలో చనిపోయిన లేగదూడ

మెదక్ రూరల్: చిరుతపులి దాడిలో లేగదూడ మృతి చెందింది. ఈ సంఘటన హవేళీఘణాపూర్ మండలం వాడీ గ్రామ పంచాయతీ పరిధిలోని మెట్టు తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన లచ్చిరామ్ నాయక్ తనకున్న పాడిగేదెలను రోజూ మాదిరిగానే గురువారం మేతకు తీసుకెళ్లాడు. తిరిగి సాయంత్రం పశువుల కొట్టంలో కట్టేశాడు. తెల్లవారు జామున కొట్టంలోకి వెళ్లి చూస్తే లేగదూడ చనిపోయినట్లు గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి ఫారెస్ట్ సెక్షన్ అధికారి శ్రావణ్, బీట్ ఆఫీసర్ హరినాయక్, పశువైద్యాధికారులు చేరుకొని చనిపోయిన లేగదూడను పరిశీలించారు. చిరుత దాడి చేయడం వల్లనే లేగదూడ మృతిచెందినట్లు అధికారులు నిర్ధారించారు. చిరుత సంచారంతో పరిసర గ్రామాల ప్రజలు, రైతులు తీవ్రభయాందోళన చెందుతున్నారు.

చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

వేర్వేరు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన ముగ్గురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుల్లో ఒక మహిళ ఉంది. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో యువకుడు, బైక్ ఢీకొనడంతో మరో వ్యక్తి, బైక్‌పై నుంచి పడిన మహిళ గాయపడ్డారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.


గుర్తు తెలియని యువకుడి మృతదేహం

సంగారెడ్డిటౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. శుక్రవారం సంగారెడ్డి పీఎస్ రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ కుర్షిద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి మండల పరిధిలోని ఎమ్మెన్నార్ చౌరస్తా వద్ద జనవరి 29వ తేదీ రాత్రి గుర్తుతెలియని వాహనం యువకుడిని ఢీ కొనడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. యువకుడి వివరాలు తెలియకపోవడంతో హనుమాన్ నగర్ సర్పంచ్ మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 87126 56746, 8712 656719 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలపాలని పోలీసులు కోరారు.


నగేశ్ (ఫైల్)

హత్నూర (సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన హత్నూర మండలం చందాపూర్ గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహత్మర మండలం చందాపూర్ గ్రామానికి చెందిన పల్లూరు నగేశ్(38) గ్రామ శివారులోని ఎస్బీఆర్ఎస్ఎక్స్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని గురువారం ఉదయం ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చేగుంట(తూప్రాన్): బైక్ పైనుంచి పడి తీవ్రంగా గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని పొలంపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మారబోయిన ఎల్లమ్మ (52) తన కుమారుడు ప్రశాంత్‌తో కలిసి బైకుపై కిరాణ వస్తువుల కోసం జనవరి 29వ తేదీన చేగుంట వెళ్లింది. అదే రోజు తిరుగు ప్రయాణంలో సాయంత్రం గ్రామ శివారులోని చెరువు సమీపంలో ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి ఎల్లమ్మ రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడింది. చేగుంటలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట జిల్లాలోనో ఆర్వీఎం ఆస్పత్రికి తనలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఎల్లమ్మ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి భర్త శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆగని ఇసుక లొల్లి

- టిప్పర్లను అడ్డుకుంటున్న చిట్యాల గ్రామస్తులు
- రాత్రి 7 గంటల వరకు కొనసాగిన ఆందోళన


గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు


రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

మెదక్ రూరల్: అభివృద్ధి పనుల కోసం ఇసుక తరలించేందుకు అధికారులు ఇచ్చిన అనుమతులు వివాదాస్పదమవుతున్నాయి. స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో ఇసుక రవాణాకు అడుగడుగూ అవాంతరాలు ఎదురవుతున్నాయి. శుక్రవారం చిట్యాల గ్రామస్తులు ఇసుక రవాణా వాహనాలను అడ్డుకున్నారు. మండలంలోని సంగాయిగుడి తండా శివారులోని హల్దీవాగు నుంచి ఇసుక తరలింపునకు అధికారులు అనుమతులిచ్చారు. ఈ క్రమంలో తమ గ్రామ శివారులో నిర్మిస్తున్న పెద్దమ్మ ఆలయానికి ఇసుకను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చిట్యాల గ్రామస్తులు సుమారు ఐదు గంటల పాటు ఇసుక వాహనాలను నిలిపివేసి రాస్తారోకో నిర్వహించారు. సామాన్యుల అవసరాలకు ఇసుక అనుమతులు ఇవ్వకుండా వందల ట్రిప్పుల ఇసుకను అనుమతుల పేరిట తరలించడాన్ని తప్పుబట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకొని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా గ్రామస్తులు ఆందోళనను విరమించలేదు. రాత్రి 7 గంటల వరకు ఆందోళన కొనసాగింది. అయితే వాహనాల రాకపోకలతో రోడ్డు పాడవుతుందని, దుమ్ము వస్తోందని, సామాన్యుల అవసరాలకు అధికారులు ఇసుక ఇవ్వడం లేదనే పలు కారణాలతో మొన్న సంగాయిగుడి తండా, నిన్న జానకంపల్లి, తాజాగా చిట్యాల గ్రామస్తులు ఇసుక టిప్పర్లను అడ్డుకొని రాస్తారోకో నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.